క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్థిక సాయం



పేద విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: నూజివీడులో ట్రిపుల్ ఐటీ చదువుతున్న మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీకి పి. షణ్ముఖవర్ధన్‌కు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం రూ. 20 వేల ఆర్థిక సాయం చేశారు. తల్లిదండ్రులు లేని విద్యార్థి షణ్ముఖవర్ధన్‌ను ఎమ్మెల్యే దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏడాదీ చదువుకయ్యే ఖర్చులన్నీ ఎమ్మెల్యే భరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల భాను, సుందర హరీష్, పడాల శ్రీనివాసరావు, కొమ్మూరు సుభోషణరావు, పోతిరెడ్డి గోపి, తహసీల్దార్ బంగారాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు పాల్గొన్నారు.

శంకుస్థాపన



విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన జనా ప్రసాద్, తదితరులు

విజయనగరం టౌన్: జగద్గురు వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ఏర్పాటుకు సంబంధించి గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనా ప్రసాద్ మాట్లాడుతూ.. విశ్వ బ్రాహ్మణులు అడిగిన వెంటనే మున్సిపల్ కార్యాలయ ఆవరణలో విగ్రహ ఏర్పాటుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్థలం కేటాయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మారోజు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు



హనుమాన్ చాలీసా చదువుతున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో పూర్వాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా సీతారామస్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత ఆశీర్వచన మంటపంలో కొలువుదీరిన ఆంజనేయస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో విశేష అభిషేకాలు జరిపించారు. సిందూరం, తమలపాకులతో అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సందర్శన



విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలస జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మూడు, నాలుగు, ఆరు తరగతులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వర్క్‌బుక్‌లు సరిగ్గా రాయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే నవంబర్ నెలలో నిర్వహించే పరీక్షకు సంబంధించి నమూనా ప్రశ్నపత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నెల్లిమర్ల: ఈ నెల 29న ఏపీటీఎఫ్ (1938) ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ పైడిరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు జరజాపుపేట ఉన్నత పాఠశాలలో ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యారంగ సమస్యల పరిష్కారానికై విజయవాడలో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఉండ్రు శ్రీనివాసరావు, కాళ్ల అప్పారావు, ఎస్. బాబ్జీ, సీహెచ్ ఎర్రినాయుడు, ఎస్వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

రిఫరల్ కేసులపై దృష్టి సారించాలి..

- కలెక్టర్ నాగలక్ష్మి



విజయనగరం రూరల్: వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో పరీక్షల అనంతరం మెరుగైన వైద్యం కోసం నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసే వారు పూర్తి వైద్య సేవలు పొందేలా దృష్టి సారించాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని గొల్లలపేటలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్, వైద్య సేవలు, మందులు, వైద్య పరీక్షలతో పాటు రిఫరల్ కేసులపై ఆరా తీశారు. శిబిరానికి హాజరైన రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నవంబర్ 15 నాటికి జిల్లా అంతటా ఆరోగ్య శిబిరాల నిర్వహణ పూర్తవుతుందన్నారు. ఒక గ్రామంలో శిబిరం పూర్తి అయిన వెంటనే రిఫరల్ కేసులపై పూర్తిగా దృష్టి పెట్టి, వారికి ఆరోగ్య శ్రీ పథకం కింద మెరుగైన వైద్యం అందేలా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందని స్పష్టం చేశారు. అలాగే సుగర్, బీపీ ఉన్నవారి ఆరోగ్యాన్ని ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా పర్యవేక్షించాలని సూచించారు.

అందరికీ ఉచిత ఉచిత వైద్యం : ఎంపీపీ మామిడి

ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ, రాష్ట్రాన్ని సంక్షేమం దిశగా తీసుకెళ్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, రాకోడు వైద్యాధికారి ఎం.జగదీష్, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే అన్ని రకాల వైద్య సేవలు : ఎమ్మెల్యే బడ్డుకొండ

భోగాపురం: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామంలోనే అన్ని రకాల వైద్య సేవలందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధి కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సచివాయ వ్యవస్థతో మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగనన్న సాకారం చేశారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల భాను, సుందర హరీష్, పడాల శ్రీనివాసరావు, కొమ్మూరు సుభోషణరావు, పోతిరెడ్డి గోపి, తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ సురేష్, ఈఓ రామకృష్ణనాయుడు, వైద్యులు తిరుపతిస్వామి, సత్యనారాయణ, సునీల్‌కుమార్, సత్యవతి, నాగమణి, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: వృద్ధుల ఆరోగ్య సమస్యలపై ఆరా తీస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు



భోగాపురం: అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ



పూసపాటిరేగ: వృద్ధురాలికి కళ్లద్దాలు పెడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ



విజయనగరం : వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజారోగ్యానికి రక్ష..

పూసపాటిరేగ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తోందని నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని వెంపడాం సచివాలయంలో పరిధిలో నిర్వహించిన వైద్యశిబిరంలో పలువురు రోగులు వైద్య సేవలు పొందారు. అలాగే కంటివెలుగు పథకంలో భాగంగా నేత్ర పరీక్షలు చేయించుకున్న పలువురికి ఎమ్మెల్యే కళ్లద్దాలు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజారోగ్యం విషయంలో మన రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మహంతి కల్యాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, సర్పంచ్ పిన్నింటి కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు పిన్నింటి నిర్మల, ప్రజాప్రతినిధులు పిన్నింటి వెంకటరమణ, పిన్నింటి ఎల్లంనాయుడు, తహసీల్దార్ ఇ. భాస్కరరావు, ఎంపీడీఓ ఎం. రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, వైద్యాధికారిలు త్రినాథ్, ప్రమీలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి..

విజయనగరం: నగరంలోని పాల్‌నగర్, వీటీ అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల కార్పొరేటర్లు మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆనందోబ్రహ్మ ఉత్సవాలకు తరలిరండి..

- ఫౌండర్ చైర్మన్ డాక్టర్ పీఎస్ గోపాలకృష్ణ



మెగా మ్యూజికల్ నైట్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆనందోబ్రహ్మ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ పీఎస్ గోపాలకృష్ణ, తదితరులు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఆనందోబ్రహ్మ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆనందోబ్రహ్మ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ పీఎస్ గోపాలకృష్ణ కోరారు. గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న జీఎస్సార్ అతిథిగృహంలో నిర్వహించిన సమావేశంలో అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న మెగా మ్యూజికల్ సినీ కల్చరల్ డ్యాన్స్ ఈవెంట్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగీతం, ధ్యానం, కూచిపూడి నృత్యాలు, అన్నమాచార్య కీర్తనలు, పాశ్చాత్య నృత్యాలు, ప్రముఖ సినీ నేపథ్య గాయకులతో సినీ సంగీత విభావరి, జబర్దస్త్ కామెడీ, మిమిక్రీ , అతిథుల సందేశాలు ఉంటాయన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పిరమిడ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు జె.రామారావు మాట్లాడుతూ, ధ్యానం విశిష్టతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలనే ఆశయంతో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆనందోబ్రహ్మ కార్యక్రమ సీఈఓ సరగడ తులసి, విజయనగరం పిరమిడ్ మాస్టర్లు రామారావు, కృష్ణారెడ్డి , శ్యామల, వంశీ, సంధ్య, శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాప్టిస్ట్ ఆవిర్భావ వార్షికోత్సవానికి తరలిరండి

విజయనగరం టౌన్: బాప్టిస్ట్ ఆవిర్భావ 150వ వార్షికోత్సవాలకు సంఘ ప్రతినిధులు, భక్తులందరూ తరలిరావాలని సిమ్స్ బాప్టిస్ట్ చర్చ్ కార్యదర్శి ఆర్ఎస్.జాన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 28న ఉదయం 9 గంటల నుంచి ఎస్ఎంబీబి చర్చిలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ అఫైర్స్, అడ్వైజర్ డాక్టర్ ఎం.బాలస్వామి హాజరుకానున్నారన్నారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేదిడ జాన్సన్, ఏపీ ఆర్టీఐ కమిషనర్ పి.జోనాథన్ శామ్యూల్ హాజరవుతారన్నారు. సమావేశంలో టి.ఆనందరావు, ఎంఏ నాయుడు, టి.సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల విజేతలతో సెట్విజ్ సీఈఓ రామగోపాల్

విజయనగరం: పైడితల్లమ్మవారి జాతర, విజయనగరం ఉత్సవాల్లో భాగంగా సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ మేరకు గురువారం విజయనగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు..విజ్జి స్టేడియంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రికెట్ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 11 జట్లు హాజరయ్యాయి. రెండు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నారు. మొదటి రోజు పోటీలను సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ ప్రారంభించారు. అలాగే ఒక్క రోజు పాటు నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు సీఈఓ అభినందనలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీలో జగనన్న ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని గృహ నిర్మాణ శాఖ పీడీ, మండల ప్రత్యేకాధికారి వి. శ్రీనివాసరావు అన్నారు. నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో హౌసింగ్ అధికార్లు జగనన్న కాలనీ సందర్శించి ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు మాట్లడుతూ, ఇంతవరకు నిర్మాణాలు చేపట్టని వారు వెంటనే పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రేవళ్ల పవన్, వార్డు ఏమినిటి కార్యదర్శి దినేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీ యాక్ట్ కేసు నమోదు

విజయనగరం క్రైమ్: ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు గురువారం తెలిపారు. బూర్జుపేటకు చెందిన అనిల్ తన వాట్సాప్‌కి వచ్చిన లింక్ ఓపెన్ చేయగా.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి ఆర్జించవచ్చని చెప్పడంతో, బాధితుడు రూ. 3.50 లక్షల వరకు మోసగాళ్లకు పంపించాడు. తర్వాత వారి అకౌంట్‌లు, నంబర్లు పనిచేయకపోవడంతో మోసపోయానని గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ బి.వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణలను అరికట్టాలి..

నెల్లిమర్ల: నగర పంచాయతి పరిధి జరజాపుపేటలో కొంతలవాని చెరువు గర్భంలో చోటుచేసుకుంటున్న ఆక్రమణలను అరికట్టాలని రైతు సంఘ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిషనర్ బాలాజీ ప్రసాద్‌ను గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆక్రమణల వల్ల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్‌బీకేల్లో ఈ క్రాప్ అర్హుల జాబితా



ఆర్‌బీకేలో ఈ క్రాప్ జాబితాను ప్రదర్శిస్తున్న ఏఓ పూర్ణిమ

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ఈ క్రాప్ అర్హుల జాబితాను అందుబాటులో ఉంచామని ఏఓ పూర్ణిమ తెలిపారు. మండలంలోని సారిపల్లి ఆర్‌బీకేలో గురువారం ఈ క్రాప్ అర్హుల జాబితాను నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సామాజిక తనిఖీల్లో భాగంగా ఆర్‌బీకేల్లో ఈ క్రాప్ అర్హుల జాబితాను ప్రదర్శిస్తున్నామన్నారు. ఏమైనా తప్పులు దొర్లితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేస్తే, సరిచేస్తారని చెప్పారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం నవంబర్ 1న అన్ని ఆర్‌బీకేల్లో తుది జాబితా ప్రదర్శిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి డాక్టర్ సన్నీడియోల్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో జాతీయ ఉపకార వేతనాలపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. విశ్వవిద్యాలయ జాతీయ ఉపకార వేతనాల నోడల్ అధికారి డాక్టర్ సన్నీడియోల్ వేతనాలు పొందడానికి కావాల్సిన అర్హతలు, ఇతర వివరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్షిక తనిఖీలు

నెల్లిమర్ల: వార్షిక తనిఖీ ల్లో భాగంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ సాంబశివరావు గురువారం స్థానిక మండల విద్యాశాఖా కార్యాలయంలో తనిఖీలు నిర్వహించా రు. ఈ సందర్భంగా ప లు రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో ఎంఈఓ యూఎస్ఎన్ మూ ర్తి, మాజీ ఎంఈఓ ఎ. కృష్ణారావు, డీఈఓ కా ర్యాలయ సిబ్బంది గాంధీ, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నారాయణరావు

నెల్లిమర్ల: విద్యార్థులకు శాంతి భద్రతలపై ఎస్సై పి. నారాయణరావు అవగాహన కల్పించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను విద్యార్థులు సందర్శించారు.ఈ సందర్భంగా చట్టాలు, వాటి పరిధి, ఎలా వినియోగించుకోవాలన్న అంశాలపై ఎస్సై అవగాహన కల్పించారు.

సిరిమాను రథాన్ని సిద్ధం చేస్తున్నాం..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



ఉత్సవ ఏర్పాట్లను కోలగట్లకు వివరిస్తున్న ట్రస్ట్ బోర్డు మెంబర్

విజయనగరం టౌన్: పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 31న నిర్వహించనున్న సిరిమానోత్సవానికి సంబంధించి సిరిమాను రథాన్ని సిద్ధం చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గురువారం స్థానిక పైడితల్లి అమ్మవారి కల్యాణ మంటపం ఆవరణలో పైడిమాంబ సేవా సంఘం, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతేడాది సిరిమాను ఊరేగింపు ఆలస్యం కావడానికి గల కారణాలపై సమీక్షించారు. ఈ ఏడాది ఊరేగింపు ఆలస్యం కాకుండా నిర్ణీత సమయానికల్లా రథాన్ని సిద్ధం చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం సిరిమాను తయారు చేసే వడ్రంగి ప్రతినిధులతో చర్చించారు. సిరిమానుతో పాటు రథాలు తిరిగే సమయంలో ఇతరులను అనుమతించకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీస్‌శాఖకు సూచించారు. సమావేశంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆర్‌జేసీ ఎంవీ సురేష్‌బాబు, ఆర్‌డీఓ సూర్యకళ, తహసీల్దార్ కోరాడ శ్రీనివాస్, ఆలయ ఈఓ సుధారాణి, డీఎస్పీలు గోవిందరావు, విశ్వనాథ్, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి సిరిమాను జాతరకు విచ్చేస్తున్న భక్తులకు, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ట్యాంక్‌బండ్ రోడ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు జరిపించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనచోదకులకు అవసరమైన పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి వాటిని చదును చేసే ప్రక్రియను శుక్రవారంలోగా పూర్తి చేయాలని చెప్పారు. బొంకులదిబ్బ ప్రాంతంలో సురభి నాటక ప్రదర్శనలు జరగనున్న నేపథ్యంలో.. పరిసర ప్రాంతాలు పరిశుభ్రపరిచి సభాస్థలిని చదును చేయాలని సూచించారు. అనంతరం పైడితల్లి దేవస్థానం చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించి, ఎక్కడా అపరిశుభ్ర వాతావరణ లేకుండా సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను తక్షణమే తొలగించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతరకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అనేకమంది హాజరుకానున్న ఈ నేపథ్యంలో పార్కింగ్ స్థలాలు అందుబాటులో తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో ఈఈ దక్షిణామూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



డిబేట్‌లో పాల్గొన్న విద్యార్థిని

విజయనగరం క్రైమ్: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం పలు పాఠశాలల విద్యార్థులు, పోలీసు ఉద్యోగులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ' లైంగిక వేధింపుల నుంచి మహిళలు , పిల్లల రక్షణ – సామాజిక పాత్ర ' అనే అంశంపైన.. పోలీసులకు ' సోషల్ మీడియా దుర్వినియోగం – సైబర్ మోసాలను అరికట్టడంలో సాంకేతికత పాత్ర ' అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని ఎస్పీ దీపిక తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ అస్మా ఫర్హీన్, ఎస్‌బీ సీఐలు విజయనాథ్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న ప్రముఖులు



అమ్మవారిని దర్శించుకుంటున్న లేళ్ల అప్పిరెడ్డి, సురేష్‌బాబు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారిని రాష్ట్ర శాసనమండలి ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు గురువారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేదపండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరి బస్సుయాత్రను విజయవంతం చేయండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



బస్సుయాత్ర వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రజారక్షణ భేరి పేరుతో సీపీఎం నిర్వహించనున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం ప్రజారక్షణ భేరి ప్రజా ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవంబర్ 2న ' మందసలో సీపీఎం అఖిల భారత నాయకులు బస్సు యాత్రను ప్రారంభించనున్నారని చెప్పారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతల్లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో మూడు బస్సు యాత్రల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేపడతామన్నారు. చివరకు నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. బస్సుయాత్రలో జిల్లా ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టీవీ రమణ, వి.లక్ష్మి పాల్గొన్నారు.